


19 వ వసంతంలోకి ...

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 19 మార్చి 2026 పేజీలు 8




## రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు
# దృష్టి సారించాలి

- రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతులతో కలెక్టర్ ముఖాముఖి...
- మండలంలో సుడిగాలి పర్యటన జరిపిన జిల్లా కలెక్టర్ బాలాజీ

**పామర్రు మేజర్ న్యూస్:** రైతులు యూరియా వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించి అధిక ఆదాయం పొందాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ పామర్రు మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత జిల్లా కలెక్టర్ మండల పరిధిలోని పెదమద్దాలి గ్రామం సందర్శించి రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతులు ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారని దుద్దివరపు కిషోర్, గొర్ల సోమేశ్వరరావు, ఎర్రంశెట్టి మిగతా 2లో...



# చేనేతకు చేయూతే లక్ష్యం..

- కళాత్మక చేనేత వస్త్రాలకు వేదికగా గాంధీ బునకర్ మేళా
- ఈ నెల 31వ తేదీ వరకు 14 రోజుల పాటు నిర్వహణ
- ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ చేనేత కళాకారులను ప్రోత్సహించాలి
- పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 18, మేజర్ న్యూస్ :** చేనేతకు చేయూతే లక్ష్యంగా, చేనేత కార్మికులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించి, ప్రోత్సహించేందుకు వీలుగా దేశంలోని ప్రముఖ చేనేత ఉత్పత్తులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి గాంధీ బునకర్ మేళా (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన)ను నిర్వహిస్తున్నట్లు పరిశ్రమలు, వాణిజ్య శాఖ (చేనేత, జౌళి) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (చేనేత, జౌళి) ఆర్‌పీ సిసో డియా అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత గాంధీ బునకర్ మేళాను ఆర్‌పీ సిసోడి యా.. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, అధికారులతో కలిసి విజయవాడలోని శ్రీ శేషసాయి కళ్యాణ వేదికలో బుధవారం ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమి ళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, హర్యానా తదితర రాష్ట్రాల చేనేత సంఘాలు, చేనేత సంస్థల ద్వారా ఏర్పాటుచేసిన 115 స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌పీ సిసోడియా మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి 112 చేనేత సంఘాలు, చేనేత సంస్థల స్టాళ్లు మేళాలో ఉన్నాయని.. రాష్ట్రం నుంచి 47 చేనేత మిగతా 2లో

# దివ్యాంగశక్తితో

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

జెండా ఊపి దివ్యాంగశక్తి పథకాన్ని ప్రారంభించిన ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు



వివరాలు 2లో...









## దివ్యాంగశక్తితో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగశక్తి పథకాన్ని ప్రవేశపెట్టి దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి ఎంతో లబ్ధిని చేకూర్చిందని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు పేర్కొన్నారు. బుధవారం ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ మచిలీపట్నం ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో దివ్యాంగశక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివ్యాంగ ప్రయాణికుల ఆర్టీసీ బస్సుకు జండా ఊపి పథకాన్ని ప్రారంభించారు. దివ్యాంగులతో కలిసి బస్సులో చిన్నాపురం వరకు ప్రయాణించారు. అనంతరం ఆయన మచిలీపట్నంలోని రహదారులు భవనాల అతిథి గృహానికి చేరుకొని దివ్యాంగులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన సభలో చైర్మన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పాటైన ప్రభుత్వాలలో స్త్రీలు, దివ్యాంగులను గొప్పగా పట్టించుకున్న ప్రభుత్వం కేవలం కూటమి ప్రభుత్వం మాత్రమే అని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం స్త్రీలు, దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఎంతో లబ్ధి చేకూర్చిందన్నారు. స్త్రీలకు స్త్రీ శక్తి పథకంతో ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా వారిలో చైతన్యం వచ్చిందని, వారు ఉద్యోగాలు, చదువులు, దైవ దర్శనాలు, బంధువులను కలవడం చేస్తున్నారని, ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వం స్త్రీలకు ఎంతో ఆర్థిక ప్రయోజనాన్ని చేకూర్చిందని గుర్తు చేశారు. గతంలో 33 శాతంగా ఉన్న స్త్రీల ప్రయాణం, స్త్రీ శక్తి పథకంతో 67 శాతానికి చేరుతుందని, మొత్తంగా 52 కోట్ల మంది పథకాన్ని వినియోగించుకున్నట్లు తెలిపారు. పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 1,826 కోట్లకు పైగా ఖర్చును భరించినట్లు చెప్పారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం భారంగా భావించకుండా స్త్రీ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. ఇదే క్రమంలో మరో అడుగు ముందుకేసి దివ్యాంగుల సంక్షేమం కోసం ఉచిత బస్ ప్రయాణాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులలో ప్రయాణించవచ్చని, నాన్ స్టాప్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అంతర్ రాష్ట్ర సర్వీసుల్లో 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చని వివరించారు. దృష్టిలోపం నూరు శాతం, మేధో వైకల్యం 40 శాతం ఉన్నవారికి వారి సహాయకులకు సైతం 50 శాతం రాయితీ వర్తించనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ తెలిపారు. దివ్యాంగులకు గతంలో రద్దయిన 4 శాతం రిజర్వేషన్లు తిరిగి ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వర్లు, మచిలీపట్నం డిపో మేనేజర్ పెద్దిరాజు, ప్రత్యేక అధికారి నిత్యానంద్, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి కామరాజు, మచిలీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ కుంచె దుర్గా ప్రసాద్ (నాని), పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు కొనకళ్ళ జగన్నాథరావు ( బుల్లయ్య), పీవీ గజేంద్రరావు, లోగిశెట్టి స్వామి, గడ్డం రాజు, లంకె శేషగిరి, సోడిశెట్టి బాలాజీ తదితర కూటమి నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పాములలంక గ్రామంలో మాజీ సర్పంచ్ పాముల శ్రీనివాసరావు తల్లి పాముల పాప ఇటీవల మరణించగా పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం, పార్టీ నాయకులు నెక్కలపు మురళి, లుక్కా రేణుకారావు తదితరులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేనేతకు చేయూతే లక్ష్యం..





(మొదటిపేజీ తరువాయి)

సంఘాలు పాల్గొన్నాయని వివరించారు. గతేడాది ఈ మేళాలో రూ. 3 కోట్ల విలువైన అమ్మకాలు జరిగాయని.. ఈసారి ఇది మరింత పెరిగే అవకాశముందన్నారు. ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లాలతో పాటు పొరుగుజిల్లాల వస్త్ర ప్రేమికులు కూడా చేనేత వస్త్రాల విలువ, విశిష్టతను గుర్తించి ఈ మేళాను సద్వినియోగం చేసుకొని చేనేత కళను, చేనేత కార్మికులను ప్రోత్సహించాలని సిసోడియా కోరారు.

**వినూత్న డిజైన్లతో వస్త్ర మేళా**

**కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

వినూత్న డిజైన్లతో అద్భుతమైన చేనేత వస్త్రాలకు గాంధీ బునకర్ మేళా వేదికగా నిలుస్తోందని, ప్రతిఒక్కరూ ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఉగాది, వేసవి నేపథ్యంలో జరుగుతున్న ఈ మేళాలో అపూర్వమైన వస్త్రాలు కొలువుదీరాయని.. ఎన్‌టీఆర్ జిల్లాతో పాటు వివిధ జిల్లాల ప్రజలు మేళాను సందర్శించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేతను, హస్తకళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందన్నారు. వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ కింద ఉన్న కొండపల్లి బొమ్మలను వినూత్న డిజైన్లతో కళాప్రియులను అలరించేలా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎ.మురళీకృష్ణ, జాయింట్ డైరెక్టర్ జి.రాజారావు, ఆప్కో జీఎం కె.కన్నబాబు, విజయవాడ వీవర్స్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌సాహు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే రాజా



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మచిలీపట్నం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కలిసి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తో కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలో చల్లపల్లి రహదారికి సమీపంలోని పామర్రులో టిడ్కో గృహాల నిర్మాణానికి ప్రతిపాదనను ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అర్హులైన లబ్దిదారుల సంఖ్య ఆధారంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మొవ్వలో మార్కెట్ యార్డు నిర్మాణానికి నిధులు అందుబాటులో ఉన్నాయని, స్థలం మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరగా, అనువైన స్థలాన్ని గుర్తించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో అంగన్ వాడి కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, ఆయా భవనాలను పూర్తి చేసేందుకు సి.ఎస్.ఆర్ నిధులను మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరారు. స్థానిక బెల్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి సిఎస్ఆర్ నిధులు సమకూరుస్తామన్నారు. పామర్రు పట్టణంలో ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, పట్టణం మీదుగా వెళ్ళిన పైపులైనుకు అదనంగా మరో రెండు గంటలు నీరు ఇవ్వాలని కోరగా, జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. నియోజకవర్గంలో గ్రామాలను కలిపే రహదారుల అభివృద్ధిపై తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, అనంతరం ప్రాధాన్యతా క్రమంలో గ్రామాలలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కె.ఆర్.ఆర్.సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శ్రీదేవి, టిడ్కో ప్రాజెక్ట్ మేనేజర్ చిన్నోడు, గృహ నిర్మాణ సంస్థ అధికారి వెంకట్రావు, పామర్రు తహసిల్దార్ జి.రవికాంత్, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, మండల పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

(మొదటిపేజీ తరువాయి)

శివయ్య, ముదునూరు సుబ్రహ్మణ్యం తదితర రైతులను అడుగగా వారు మాట్లాడుతూ తాము వరి, మినుము పంటలు వేస్తున్నామని చెప్పారు. ఆ పంటలే తమకు సాగు చేయుటకు అనుకూలంగా ఉన్నాయని కలెక్టర్ కు వివరించారు. ఆ పంటలు కాక ఆయిల్ పామ్ లేదా ఇతర పంటలు ఏమైనా వేస్తున్నారా అని కలెక్టర్ విచారించగా ఆయిల్ పామ్ సాగు చేయడం లేదని, గతంలో కందులు వేసేవారమని వాటి వలన వర్షాలు వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతూ ఉండడంతో వాటిని ప్రస్తుతం సాగు చేయడం లేదని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం బుడమేరు వరదల కారణంగా దెబ్బతిన్న వరి పంట పొలాలను పరిశీలించామని, ఒకవైపు రసాయనిక ఎరువులు వేసిన వరి పొలం, దాని పక్కనే ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన వరి పొలం గమనించామని, మొదట్లో రెండింటిలోనూ నాలుగైదు రోజులు వరద నీరు నిలిచి ఉందని, ఆ తర్వాత ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన వరి పంట నిటారుగా నిలిచిందని మంచి దిగుబడి వచ్చిందన్నారు. రసాయన ఎరువులతో సాగుచేసిన వరి పంట దిగుబడి లేక రైతు నష్టపోయారన్నారు. వరి నాట్లు వేసే ముందు రైతులు ముందస్తుగా (పిఎండిఎస్ ) ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ అనగా వర్షాకాలం రాకమునుపే 32 రకాల విత్తనాలతో తయారుచేసిన విత్తనాల బంతులను (సీడ్ బాల్స్) పొలంలో వెదజల్లి, ఆ తర్వాత వరి పంట సాగు చేయాలని, అలా రెండు మూడు పంట కాలాలు తప్పనిసరిగా పాటిస్తే రైతులకు మంచి దిగుబడి, తద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. రైతులందరూ రాను రాను యూరియా వాడకం మోతాదు పెంచుతున్నారన్నారు. అలా చేయడం వల్ల నేలలో సారం తగ్గిపోతుందన్నారు. ఇకనైనా యూరియా వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని కోరారు. తద్వారా నేల బలోపేతం అవుతుందన్నారు. పంట దిగుబడులు బాగా రావాలంటే ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 5 సూత్రాలను విధిగా పాటించాలన్నారు. గ్రామంలో కూలీల సమస్య ఉందని ఈ సందర్భంగా రైతులు కలెక్టర్ కు తెలుపగా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ అవసరమైతే వారికి డ్రోన్లు పంపిస్తామని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు గ్రామంలో మురికి కాలువ లేదని, వర్షం వచ్చినప్పుడు మురికి నీరు ప్రవహించకపోవడంతో పిల్లలను పాఠశాలకు తీసుకొని వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా ఆయన వెంటనే స్పందిస్తూ కచ్చా మురికినీటి కాలువను ఏర్పాటు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో గంగాధర్ రావు, పంచాయతీ కార్యదర్శి కి సూచించారు.

**అంగన్ వాడి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్**

అనంతరం జిల్లా కలెక్టర్ ఇటలీ కి చెందిన కేర్ టు యాక్షన్ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన నిధులతో పునరుద్ధరించిన అంగన్ వాడి సక్షం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి చిన్నారులతో కలెక్టర్ ముద్దుముద్దుగా మాట్లాడుతూ వారి పేర్లను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం చుట్టూ పరిసర వాతావరణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్ వాడి కేంద్రాలకు స్వచ్ఛంద సంస్థ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను కంప్యూటర్ ద్వారా పరిశీలించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తోమాసా ఖరారో, ఆందోనియా, దొరియోలు జిల్లా కలెక్టర్ కు మర్యాదపూర్వకంగా మొక్కను అందజేయగా, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారిని కలవడం చాలా సంతోషంగా ఉందని, అంగన్ వాడి కేంద్రాలకు సహకారం అందిస్తున్నందుకు అభినందిస్తున్నానన్నారు. రానున్న రోజుల్లో పామర్రు మండలంలో 70శాతం పనులు పూర్తయిన 18 మినీ అంగన్ వాడిల నిర్మాణం పూర్తి చేయుటకు సహకారం అందించాలని కోరడంతో అందుకు వారు సమ్మతించారు.

**నిర్మాణంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహం పరిశీలన**

అనంతరం జిల్లా కలెక్టర్ పామర్రు లోని చాట్లవానిపురం సందర్శించి అక్కడ మూడు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని, ప్రణాళిక చిత్రపటాన్ని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఉయ్యూరు ఆర్డిఓ బి. శ్రీదేవి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎన్.రాణి, ఎపిఇడబ్ల్యుఐడిసి ఈ.రాజన్న, తహసిల్దారు జి.రవికాంత్, డిప్యూటీ ఎంపీడీవో గంగాధర్ రావు, మండల వ్యవసాయ అధికారి వి.శివనాగరాణి, ఏఈ రాజేష్, వసతి గృహం సంక్షేమ అధికారి వీణాకుమారి, కేర్ టు యాక్షన్ డైరెక్టర్ వెంకటస్వామి, అడ్వైజర్ కళామణి, విఏఏ శేఖర్, అంగన్ వాడి ఉపాధ్యాయురాలు కోమలి తదితర అధికారులు పాల్గొన్నారు.

# గోద్రెజ్ జెర్సీ ఇండియా 2025-26 ఆర్థిక సంవత్సరం లాక్టోగ్రాఫ్ ఫలితాలు

విజయవాడ మేజర్ న్యూస్ : భారతదేశంలో పాలతో ఉన్న అనుబంధం కేవలం ఒక గ్లాసు పాలు తాగడానికే పరిమితం కాలేదు. మన అల్పాహారం, పండగ సమయంలో పంచుకునే మిఠాయిలు, రోజువారీ వంటలు, ఇప్పుడు ప్రోటీన్ షేక్స్, స్మూతీలలో కూడా పాలు భాగమయ్యాయి. గోద్రెజ్ జెర్సీ విడుదల చేసిన లాక్టోగ్రాఫ్ నివేదిక ప్రకారం.. భారత దేశంలో 75.8 శాతం మంది ఇప్పుడు యాక్టివ్ డైరీ వినియోగదారులుగా ఉన్నారు. అంటే వీరు కేవలం పాలు మాత్రమే కాకుండా పెరుగు, పనీర్, నెయ్యి, వెన్న, లస్సీ, యోగర్ట్, చీజ్ వంటి రకరకాల పాల ఉత్పత్తులను క్రమం తప్పకుండా వాడుతున్నారు. పాలు కేవలం అప్పుడప్పుడు తీసుకునే అదనపు పానీయం మాత్రమే కాదు.. అన్ని ప్రాంతాలు, అన్ని తరాల వారి భారతీయ ఆహార సంస్కృతిలో భాగమైపోయిన రోజువారీ బహుళ-ఉత్పత్తుల పోషకాహార వ్యవస్థగా డైరీ ఆవిర్భవించింది. ఒక గ్లాసు పాలకు బదులుగా, భారతీయ గృహాలు ఈ నివేదిక పేర్కొన్న విధంగా ఒక "డైరీ బాస్కెట్"ను (పాల ఉత్పత్తుల సముదాయం) నిర్మించుకుంటున్నాయి. యాక్టివ్ డైరీ వినియోగదారులలో జాతీయ స్థాయిలో పెరుగు (80 శాతం), పనీర్ (76 శాతం), వెన్న (74 శాతం), నెయ్యి (71 శాతం) అత్యంత ఇష్టపడే ఉత్పత్తులుగా ఉన్నాయి. వీటి తర్వాత వరుసగా లస్సీ (63 శాతం), చీజ్ (58 శాతం), యోగర్ట్ (57 శాతం), సంప్రదాయ పాల మిఠాయిలు (55 శాతం) ఉన్నాయి. వంటల్లో, భోజన అనుబంధ పదార్థాలుగా, చిరుతిళ్లుగా, వేడుకలలో డైరీ పోషిస్తున్న పాత్రను ఈ విస్తృత వినియోగం నొక్కి చెబుతోంది.

## దివ్యాంగులకు విపత్తుల అవగాహనలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట, మార్చి 18, మేజర్ న్యూస్ : ఎన్టీఆర్ జిల్లా పరిధిలో విపత్తుల సమయంలో ప్రజలు ఎలా స్పందించాలి అనే అంశంపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం సహకారంతో 05-03-2026 నుండి 28-03-2026 వరకు వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌డిఆర్ఎఫ్ బృందం సభ్యులు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో చేయాల్సిన చర్యలు, ప్రాణరక్షణకు సంబంధించిన ముఖ్య సూచనలను వివరించారు. ముఖ్యంగా దివ్యాంగులు విపత్తుల సమయంలో ఎదుర్కొనే సమస్యలు, వాటిని అధిగమించే మార్గాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ప్రజల భద్రత కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ ఈ సూచనలను పాటించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, సిఐ, ఫైర్ ఎస్ఐ, ఎన్‌డిఆర్ఎఫ్ బృందం సభ్యులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కష్టాన్ని దోచుకుంటున్న దళారులు..పట్టించుకోని అధికారులు

### వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట రూరల్, మార్చి 18, మేజర్ న్యూస్ : రబీ సీజన్లో పండించిన మొక్కజొన్న పంటకు మద్దతు ధర లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఏలూరు శివాజీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల పరిధిలోని ఆటోనగర్ వద్ద మొక్కజొన్న రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులతో కలిసి మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించి మొక్కజొన్న సరైన గిట్టుబాటు ధర కల్పించాలని స్థానిక నాయకులతో రైతులతో కలిసి తన్నీరు నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల నుంచి మొక్కజొన్న పంటను నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అవసరమైన అన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాంటి పంటకు క్వింటాకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2400 కూడా అందడం లేదని ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. దళారుల ప్రభావాన్ని అరికట్టడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి, జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి దేవినేని రామారావు, జిల్లా రైతు విభాగ కార్యదర్శి బెదడాం సత్యనారాయణ, జిల్లా రైతు విభాగ కార్యవర్గ సభ్యులు మోరే దుర్గాప్రసాద్, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు కనగాల రమేష్, మండల రైతు విభాగ అధ్యక్షులు గూడపాటి శేషయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.




# తిరుపతిని కూడా ముఖ్యమంత్రి రాజకీయం చేస్తున్నారు

### వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే డిమాండ్



పామర్రు మేజర్ న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టాక ఎంతో ప్రాముఖ్యత కలిగిన తిరుపతిని కూడా రాజకీయం చేస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ విమర్శించారు. పామర్రులోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని అపవిత్రం చేసే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు తిరుపతి లడ్డు విషయంలో అనేక అబద్దాలను ప్రచారం చేసి ప్రతిష్ట దిగజార్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ గా ఉన్న బిఆర్ నాయుడు పై ఆరోపణలు రాగా కనీసం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యక్షంగా ఆయనకు సంబంధించిన వీడియోలు బయటకు వచ్చినప్పటికీ ఆయనపై చర్యలు తీసుకోకపోగా, తిరుపతిలో ఆయన ఉన్న హోటల్ వద్ద కొందరు మహిళలు ఆయనను ప్రశ్నించేందుకు వెళ్లగా వారిపై పోలీసులతో లాఠీఛార్జి చేయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఒక ఛానల్ అధిపతిగా ఉన్న ఆయన నేను ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందనే ధోరణితో ప్రవర్తించడం బిఆర్ నాయుడుకే చెల్లిందని పేర్కొన్నారు. భగవంతుడు ఎప్పటికైనా వీరికి తగిన శాస్తి చేస్తారని ఆయన పేర్కొన్నారు. పామర్రు నియోజకవర్గంలో ఎన్నికలకు రెండున్నర సంవత్సరాల ముందు వర్ల కుమార్ రాజా ఇప్పుడు ఉన్నటువంటి గౌరవ ఎమ్మెల్యే గ్రామ గ్రామానికి తిరిగి తనపై విష ప్రచారం చేశారన్నారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే అర్హులైన వారందరికీ మూడు సెంట్ల ఇళ్లస్థలం ఇవ్వడంతో పాటు అవినీతిపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గ్రామాల్లో మీ పార్టీ నాయకుల ద్వారా చెరువులు తవ్వించి అక్రమంగా మట్టి తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారనే విషయం ప్రజలకు తెలుసునన్నారు. అయితే అనుమతులు లేకుండా ఒక చెరువును కూడా తవ్వకుండా అడ్డుకుంటామని అనిల్ కుమార్ స్పష్టం చేశారు. గత ఏడాది కొన్ని గ్రామాలలో చెరువులు తవ్వి కోట్లాది రూపాయలు వెనకవేసుకున్నారని, ఈ ఏడాది అలాకా కుండా అనుమతులు లేకుండా చెరువులు తవ్వితే అడ్డుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులకు కూడా కాంట్రాక్టర్ల నుండి పర్సంటేజీలు తీసుకుంటూ అవి ఇవ్వని కాంట్రాక్టర్ల టెండర్లను రద్దు చేయిస్తున్నారని అనిల్ కుమార్ ఆరోపించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని ప్రజలకు సేవ చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యేగా ఎన్నుకున్న ప్రజలకు జవాబుదారీగా ఉంటూ వారి కనీస అవసరాలు తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీలు దాసరి అశోక్ కుమార్, గోగం సురేష్, పార్టీ నాయకులు రాజులపాటి రాఘవరావు, ఆరేపల్లి శ్రీనివాసరావులతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## వినియోగదారుల న్యాయ ర్యాంకింగ్‌లో పెద్ద రాష్ట్రాల్లో మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్

విజయవాడ మేజర్ న్యూస్ : భారతదేశంలో మొట్టమొదటిసారిగా వివాదాల పరిష్కార కమిషన్ సామర్థ్యాలను పరిశీలించిన ఇండియా జస్టిస్ రిపోర్ట్ (ఐజెఆర్) కన్స్యూమర్ జస్టిస్ రిపోర్ట్ (వినియోగదారుల న్యాయ నివేదిక 2026)ను విడుదల చేసింది. భారతదేశ వ్యాప్తంగా 19 పెద్ద, మధ్య తరహా (ఒక్కొక్కటి కోటి కంటే ఎక్కువ జనాభాతో) రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఆ తరువాత స్థానాలలో నిలిచాయి. సమాచార హక్కు చట్టం కింద చేసిన విచారణలు, పార్లమెంటరీ ప్రతిస్పందనల ద్వారా పొందిన పబ్లిక్ డేటాను ప్రధానంగా ఉపయోగించి చేసిన ఈ అధ్యయనం బడ్జెట్లు, మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, పనిభారం, వైవిధ్యం అనే పిల్లర్ల ద్వారా రాష్ట్ర పనితీరును అంచనా వేసింది. వినియోగదారుల రక్షణ చట్టం, 2019 ప్రకారం చట్టబద్ధమైన బాధ్యతలను నెరవేర్చడానికి రాష్ట్రాలు ఎంత బాగా సన్నద్ధమయ్యాయో ఈ ర్యాంక్ సూచిస్తుంది.

## దేశవ్యాప్త ఇసుజు ఐ-కేర్ ప్రీ-సమ్మర్ క్యాంప్‌ను ప్రకటించిన ఇసుజు మోటార్స్ ఇండియా




విజయవాడ మేజర్ న్యూస్ : ఉత్తమ సేవ, యాజమాన్య అనుభవాన్ని అందించాలనే ఇసుజు యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించే ప్రయత్నములో, ఇసుజు మోటార్స్ ఇండియా తన ఇసుజు డి-మ్యాక్స్ పిక్-అప్స్, ఎస్‌యువీలకు ఒక దేశ-వ్యాప్త 'ఇసుజు ఐ కేర్ ప్రీ-సమ్మర్ క్యాంప్'ను నిర్వహిస్తుంది. వినియోగదారులకు ఉత్తేజకరమైన ప్రయోజనాలను, ఈ కాలంలో దేశవ్యాప్తంగా సమస్యలు-లేని డ్రైవింగ్ అనుభవము కొరకు నివారణాత్మక నిర్వహణ పరీక్షలను అందించడం ఈ సేవా శిబిరం లక్ష్యం. ఇసుజు కేర్ ప్రయత్నం అయిన ఈ ప్రీ-సమ్మర్ క్యాంప్ అన్ని ఇసుజు అధీకృత డీలర్ సర్వీస్ అవుట్‌లెట్స్‌లో 23-28 మార్చ్ 2026 మధ్యలో (రెండు రోజులు కలుపుకొని) నిర్వహించబడుతుంది. ఈ సమయములో, వినియోగదారులు తమ వాహనాల కోసం ప్రత్యేక ఆఫర్లు, ప్రయోజనాలను కూడా అందుకోవచ్చు.

## అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దు

### లోతట్టు, కొండవాలు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరూ సురక్షితమైన ప్రదేశాలకు తరలి రావాలి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ శాఖ, ఎన్టీఆర్ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో లోతట్టు, కొండ వాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరూ సురక్షితమైన ప్రదేశాలకు తరలి రావాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న మూడు నుంచి నాలుగు గంటలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు, కొండవాలు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరూ సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలని అన్నారు. సురక్షితమైన ప్రదేశాలకు చేరుకున్నాక అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇంటి నుంచి బయటికి రావద్దని కోరారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల పునరావస కేంద్రాలన్నిటిని పూర్తి అందుబాటులో ఉంచారని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా విజయవాడ నగరపాలక సంస్థ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగు చర్యలు తీసుకుంటుందని అన్నారు.

## అమ్మవారికి నూతన వస్త్రాలు బహుకరణ



మొవ్వ మేజర్ న్యూస్: శ్రీపరాభవనామసంవత్సరం తొలి రోజైన ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలోని దేవేరులకు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు కళారత్న పసుమర్తి. రామలింగ శాస్త్రి (హైదరాబాద్) దంపతులు, బుధవారం దేవాలయ పాలకమండలి ఉపాధ్యక్షులు పసుమర్తి. నారాయణమూర్తి దంపతులు అర్చకులు పెనుమూడి సతీష్ కుమార్ కు అందజేశారు.

# దివ్యాంగుల సాధికారతకు సరికొత్త శక్తి





### ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసేలా దివ్యాంగ శక్తి పథకం

### స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ దిశగా ప్రయాణం

### ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్‌టీఆర్ జిల్లా, మార్చి 18, మేజర్ న్యూస్ :** అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా ముందడుగు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సాధికారతకు కొత్త శక్తినిచ్చేందుకు దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని, దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ప్రగతి దిశగా పయనించేందుకు ఈ పథకం దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. దివ్యాంగ శక్తి పథకాన్ని గౌరవ ముఖ్యమంత్రి.. గౌరవ ఉప ముఖ్యమంత్రి,.. మంత్రి నారా లోకేష్‌తో కలిసి మంగళగిరిలో ప్రారంభించిన అనంతరం విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ – సిటీ టెర్మినల్ ఒకటో నంబరు ప్లాట్‌ఫాం వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. దివ్యాంగ శక్తి పథకం ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగులతో కలిసి బస్సులో కొంత దూరం ప్రయాణించారు. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించవచ్చని వారికి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గతంలో ఉన్న నిబంధనలను తొలగించి దివ్యాంగ శక్తి ద్వారా 21 కేటగిరీల్లో 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్నవారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం జరుగుతోందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి పథకాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లాలోనూ అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలు జరిగాయన్నారు.

సమాజం అభివృద్ధి పథంలో పయనించాలంటే అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకు నేలా చేయూతనివ్వాలనే ధ్యేయంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు ఒక కుటుంబం–ఒక పారిశ్రామికవేత్త సాకారానికి కూడా ఈ పథకం చేయూతనిస్తుందని వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారిని సమాజంలో మరింత చురుకుగా భాగస్వామ్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ టి.సాయిచరణ్ తేజ, బస్టాండ్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సీహెచ్ సూర్య పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగశక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వర్ల, కలెక్టర్ బాలాజీ

**పామర్రు మేజర్ న్యూస్:** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దివ్యాంగ శక్తి పథకాన్ని బుధవారం పామర్రులో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రారంభించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక బస్సులను జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యుడు కుమార్ రాజా, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ బాలాజీ ఒక బస్సులో దివ్యాంగులతో కలిసి మచిలీపట్నం వెళ్లే బస్సులో ప్రయాణించారు. అలాగే ఎమ్మెల్యే కుమార్ రాజా ఇతర నాయకులు మరో బస్సులో పామర్రు నుండి కూచిపూడి వరకు దివ్యాంగులతో ముచ్చటిస్తూ ప్రయాణించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఉచిత టికెట్లను కుమార్ రాజా అందజేశారు. బస్సులో వారితో ప్రయాణిస్తూ వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకుని వారికి సంక్షేమ పథకాలు సమయానికి అందుతున్నాయా లేవా అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా తెలుగు



దేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వర రావు, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ డిప్యూటీ సీటీఎం వి.నీలిమ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా డ్వామా పీడి ఎన్.శివప్రసాద్ యాదవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జక్కా శ్రీనివాసరావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులతో కలిసి బస్సు ప్రయాణం చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ



**హనుమాన్ జంక్షన్/గన్నవరం, మార్చి 18, మేజర్ న్యూస్ :** దివ్యాంగుల సాధికారతకు కొత్త దిశగా దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖ, కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో దివ్యాంగుల కోసం రూపొందించిన ఈ పథకాన్ని బుధవారం హనుమాన్ జంక్షన్ బస్ స్టాండ్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ఈ పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా ప్రభుత్వం ఈ సౌకర్యాన్ని కల్పించిందని తెలిపారు. పథకం ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి, గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో వారికి స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యం తరహాలోనే దివ్యాంగులకు కూడా ఈ సౌకర్యం అందించడం సంతోషకరమని అన్నారు. గన్నవరం నియోజకవర్గంలో సుమారు 42 వేల మంది మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగిస్తున్నారని, దీనివల్ల కుటుంబాలకు కోట్ల రూపాయల ఆదా అవుతోందని వివరించారు. దివ్యాంగులకు గతంలో 108 ట్రైసైకిళ్లు పంపిణీ చేశామని, రాబోయే రోజుల్లో మిగిలిన వారికి ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రయాణికులు కూడా దివ్యాంగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించి, బస్సుల్లో వారికి సీట్లు కేటాయించి సహకరించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడుతూ రామవరప్పాడు, ప్రసాదంపాడు ప్రాంతాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేర్చితే మౌలిక వసతులు మెరుగుపడతాయని, దీనిపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని తెలిపారు. మల్లవల్లి ఇండస్ట్రియల్ ఏరియా విస్తరణ ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, అలాగే గన్నవరం నియోజకవర్గంలో నిరుద్యోగుల కోసం ఉచిత ఏఐ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, దయాల రాజేశ్వరరావు, అట్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## పెడన నియోజకవర్గంలో దివ్యాంగ శక్తి



**పెడన, మేజర్ న్యూస్ :** ఉగాది పండుగ కానుకగా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే దివ్యాంగ శక్తి పథకాన్ని రాష్ట్రం మొత్తం ప్రారంభం కానున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ప్రారంభించడం జరిగిందని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బంటుమిల్లి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వికలాంగులు, ప్రజలు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట ఆర్టీసీ బస్టాండ్‌లో 'దివ్యాంగ శక్తి'



**జగ్గయ్యపేట, మార్చి 18, మేజర్ న్యూస్ :** ఉగాది పండుగ సందర్భంగా కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న ప్రత్యేక కానుకగా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఈ పథకాన్ని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) లాంఛనంగా ప్రారంభించారు. దివ్యాంగులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పట్ల ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో పని చేస్తుందని, వారి సమగ్ర అభివృద్ధే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆర్టీసీ సిబ్బంది, దివ్యాంగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు భోజనం ఏర్పాటు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బుధవారం జిల్లా కలెక్టర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నగరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో దివ్యాంగులకు ఏర్పాటు చేసిన భోజన కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ దివ్యాంగుల యోగక్షేమాలను, పింఛను వస్తుందా లేదా అని అడిగి తెలుసుకుంటూ వారికి భోజనం స్వయంగా వడ్డించి వారితో కలిసి భుజించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగశక్తి పథకం ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకొని వారి జీవనోపాదులను మెరుగు పరుచుకోవాలన్నారు. ఎవరికైనా ఉపాధి కోసం ఆర్థిక సహాయం కావాలంటే సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రశేఖరరావు వయోవృద్ధులు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి కామరాజు పర్యవేక్షకులు ప్రశాంతి విహెచ్ పిఎస్ సంఘం అధ్యక్షురాలు స్వాతి నాయుడు హెచ్ హెచ్ సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

## దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయ తలపెట్టిన దివ్యాంగశక్తి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. బుధవారం స్థానిక బస్టాండ్ గ్రామంలో అర్హత కలిగిన దివ్యాంగులకు ఉచిత బస్ పాసులు అందచేసిన ఎంఎల్ఏ దివ్యాంగుల తొలి ఉచిత ప్రయాణ బస్సును పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అవనిగడ్డ నుంచి చల్లపల్లి వరకూ దివ్యాంగులతో కలిసి ప్రయాణం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి సాయిబాబు, డిపో మేనేజర్ హనుమంతరావు, యువ నాయకుడు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఎంపీపీ సుమతీదేవి, సర్పంచ్ ఉమా, ఎంపీడీఓ చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలక్ష్మి, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది పురస్కారానికి ఎంపికైన పి.ఎం.ఎస్. ప్రసాద్



**పామర్రు మేజర్ న్యూస్ :** సంఘ సేవకులు, సాహితీ వేత్త, రచయిత కృష్ణాజిల్లా పామర్రుకు చెందిన ప్రాతూరి మోహన్ సత్య ప్రసాద్(పి.ఎం.ఎస్) కి ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం జర్నలిజం -సంఘ సేవ (సోషల్ వర్క్) విభాగంలో లభించింది. కరోనా కాలంలో మానవత సేవ సంస్థ అధ్యక్షులుగా ప్రసాద్ నిత్యం దాతల సహకారంతో పేద వర్గాలకు భోజనం ఏర్పాటు, కరోనాలో మృతి చెందిన మృత దేహాలకు దహన సంస్కారాలు నిర్వహించి అధికారుల, ప్రజల ప్రశంసలు పొందారు. లయన్స్ క్లబ్, కళా పరిషత్, రెడ్ క్రాస్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ తో పాటు అనేక దార్మిక సంస్థల ప్రతినిధిగా అనేక సామాజిక సేవ కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, పేద విద్యార్థుల విద్యాభున్నతికి కృషి చేశారు. పర్యావరణ పరిరక్షణకు అనేక అవగాహనా సదస్సులు నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస తరగతులను విద్యాలయాల్లో నిరంతరం నిర్వహిస్తూ ఉంటారు. సంఘ సేవలో విశ్వ దాత అవార్డు, అమ్మ సేవ అవార్డు, ఉత్తమ లయన్స్ ప్రెసిడెంట్ అవార్డు, మానవత సేవ రత్న అవార్డు, పర్యావరణ పరిరక్షణ లో రెడ్ క్రాస్ అవార్డు, రచయితగా రాష్ట్ర ప్రభుత్వ తెలుగు భాష సేవారత్న అవార్డు, సాహిత్య రంగంలో ఎన్టీఆర్ వజ్ర పురస్కారం, మానస అవార్డు, గుర్రం జాషువా మిలీనియం అవార్డు, గిడుగు రామ్మూర్తి స్మారక అవార్డులతో పాటు అనేక ప్రశంసా పత్రాలు, సన్మానాలు పొందినప్పటికీ శాలువాలు, దండలకు బదులు పేద విద్యార్థుల కోసం నోట్ పుస్తకాలు, పేదల తిండి కోసం బియ్యం మాత్రమే స్వీకరించే విషయం ఆయన సేవా నిరతికి దర్పణం పడుతోంది. గతంలో అనేక అవార్డు లు అందుకున్న ప్రసాద్ కు ఈ అవార్డు కిరీటంగా నిలుస్తుందని పామర్రు లోని మానవత సేవ సంస్థ, కళా పరిషత్, లయన్స్ క్లబ్, రెడ్ క్రాస్, కృష్ణాజిల్లా ప్రెస్ క్లబ్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, వి.హె చ్.పి. ప్రతినిధులు, పలు రాజకీయ పక్ష నేతలు కొనియాడుతూ అభినందనలు తెలిపారు.



## విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం వారి ఉగాది పురస్కారాలు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం,స్వర్ణకారులు సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఉగాది పురస్కారాల కరపత్రాన్ని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం కోశాధిపతి పెంటా శివప్రసాద్ అధ్యక్షతన విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ఉగాది సందర్భంగా సాంస్కృతిక సమాజ వివిధ సంఘాలలో సేవలు అందించిన సేవామూర్తులకు ఉగాది పురస్కారాలు కన్యకాపరమేశ్వరి స్ట్రీట్ లైన్లో ఏర్పాటు చేయు వేదికపై రేపు ఉదయం 10 గంటలకు విశ్వకర్మ భగవానుడీ పూజ అనంతరం ఉగాది పురస్కారాల వేడుక జరుగుతుందన్నారు.వేసవిని పురస్కరించుకుని చలివేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ప్రతినిధులు మానేపల్లి కృష్ణ మోహన్,గాదె వీరభద్రాచార్యులు రాష్ట్ర స్వర్ణకార సంఘం కార్యదర్శి గడ్డంరాజు, విశ్వబ్రాహ్మణ స్వర్ణకార నాయకులు కొండా, చేబ్రోలురవి,నాదే ఆలీ,పడమటి రామ్మోహన్ రావు,ఆలపాటి సుధాకర్,గాదె వెంకటరమణ, ప్రసాద్,శ్రీనివాస్,వంకాయల రవీంద్ర, పి.శరశ్చంద్ర,పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మసమాజం ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక రాజుపేట లోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో బ్రహ్మసమాజం వారి ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమాజ కార్యదర్శి డా.ఉడత్తు శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు డా ఉడత్తు మాట్లాడుతూ రంజాన్ నెల పవిత్ర మాసమని ఉపవాసాల మాసమని సూర్యోదయం నుంచి అస్తమయే వరకు ఉపవాసం చేస్తారని అన్నారు సయ్యద్ పీర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. పీర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాస విశిష్టతను వివరించారు విశేష ప్రతిభ కనబరచిన విద్యార్థిని ప్రవల్లిక నగదు పరితోషికంతో సత్కరించారు. కొద్ది మందికి వస్త్రదానం చేసారు ఈకార్యక్రమంలో డా ఉడత్తు శ్రీనివాసరావు, సయ్యద్ పీర్, చిలుకోటి ప్రసాద్, ఎండూరి వెంకట సుధ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి తదితరులు ప్రసంగించారు. పాఠశాల కరెస్పాండంట్ వి డి వి నవీన్ కృష్ణ, టీచర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## అధిక దిగుబడి సాగు చేసి ఆదాయం పెంచుకోవాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నార్త్ మండలం కానూరు పంచాయతీ జీ కానూరు గ్రామంలో బుధవారం కృష్ణజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం కార్యక్రమం డోర్ టూ డోర్ ప్రచార కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అన్న దాత సుకీభవ నిధులు జామ కావడంతో ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉందని చెప్పారు. అధిక దిగుబడి సాగు చేసి ఆదాయం పెంచుకోవాలని తెలియచేశారు. రైతును రాజుగా చేసే దిశగా ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన ఐదు అంశాలను గడప గడపకు ప్రచారం చేశారు. ప్రతి ఎకరాకు నీరందించేందుకు ఈ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించారు, బీజ అమృతం తయారీ, విత్తన గుళికలు తయారీ గురించి చెప్పారు, ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వర ప్రసాద్, వీ ఆర్ ఓ సుబ్బయ్య దాస్,కోపరేటివ్ బ్యాంకు సెక్రటరీ అడపా శ్రీనివాసరావు, గోపు వెంకటరమణ, గణపబత్తుల చోడమనిరావు,గణపబతుల తాతయ్య, దివి రంగబాబు, పుప్పాల నాగేశ్వరావు, చిటికీనేటి పాండురంగారావు, మరుబోయిన వెంకటాచలం, స్వర్ణ గ్రామ సిబ్బంది,అంగన్వాడీ టీచర్స్, తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీఓ



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలో ఆరు పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీఓ డి. సుహాసిని బుధవారం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల సందర్శిం చి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మండలంలో ఆరు కేంద్రాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలకు హిందీ పరీక్షకు ముగ్గురు విద్యార్థులుగైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ ప్రకటించింది. 546 మంది విద్యార్థులకుగాను543 మంది విద్యార్థులు హాజరయినట్లు మండల విద్యాశాఖ తెలిపింది.

# టెన్త్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, తనిఖీ బృందం



**పామర్రు మేజర్ న్యూస్ :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా రెండవ పరీక్ష రోజు అయిన బుధవారం పరీక్షా కేంద్రాలను అధికారుల బృందాలు తనిఖీ చేశాయి. మండల కేంద్రమైన పామర్రు లోని కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న రెండు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులకు ఏర్పాటుచేసిన వసతి సౌకర్యాలు, వైద్య శిబిరం ఏర్పాట్లు కూడా ఆయన పరిశీలించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల విధులలో ఉన్న ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసే విధంగా ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. మండలంలో ఉన్న అన్ని పరీక్ష కేంద్రాలను గుడివాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి రవికుమార్ బృందం పరిశీలించింది. మండలంలోని పామర్రు, అడ్డాడ, నిమ్మకూరులలో గల పరీక్షా కేంద్రాలను ఈ బృందం పరిశీలించి అక్కడ ఉన్న ఏర్పాట్లను తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులకు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చూడాలని ఈ సందర్భంగా డివైఇఓ రవికుమార్ సూచించారు. కాగా మండలంలో మొత్తం 691 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి - 2 జి.పద్మవాణి తెలిపారు. పామర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 'ఎ' కేంద్రంలో ఇద్దరు, 'బి' కేంద్రంలో ఒకరు, అసిస్సి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముగ్గురు, అడ్డాడ జడ్పీ హైస్కూల్లో నలుగురు, నిమ్మకూరులోని రెసిడెన్షియల్ పాఠశాలలో ఇద్దరు వంతున పరీక్షలకు గైర్హాజరయ్యారని పద్మవాణి తెలిపారు.

## చాగంటిపాడులో రైతన్న మీకోసంలో ఎమ్మెల్యే



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొని రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. మండల పరిధిలోని చాగంటిపాడు గ్రామంలో కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న వివిధ రాయితీలు, వ్యవసాయంలో తీసుకువస్తున్న నూతన సాంకేతిక, ఆధునిక పద్ధతులను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జనగణనకు ఏర్పాట్లు సక్రమంగా చేయండి



**పెదపారుపూడి మేజర్ న్యూస్:** త్వరలో జరగబోవు జనగణనకు సంబంధించి గ్రామాలలో చేపట్టవలసిన చర్యలను బాధ్యతగా చేపట్టాలని తహసిల్దార్ బి.శ్రీను నాయక్ విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్ లు, ఇంజనీరింగ్ సహాయకులు, గ్రామ రెవెన్యూ సహాయకులకు ఏర్పాటుచేసిన సమావేశంలో వారికి పలు సూచనలను అందించారు. 2026 -27జనగణనకు సంబంధించి గ్రామాలలో ఒక్కొక్క భాగంలో 180 ఇళ్ళు, 750 నుండి 800 జనాభా ఉండేవిధంగా విభజించవలసి ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఆ విధంగా విభజన ఉండేలా ప్రతి ఒక్కరు ఖచ్చితంగా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశిల్దార్ కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్ కొడాలి యేసు పాదం, డిప్యూటీ యం.పి.డి.వో లు వంగా శ్రీనివాస్, పూర్ణచంద్రరావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వైసీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా గోపీకృష్ణ



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా బేతపూడి గోపీకృష్ణ ని పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి,గన్నవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి, మండల పార్టీ అధ్యక్షులకు,నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన నాయకులకు, బేతపూడి గోపీ కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరినీ సోషల్ మీడియా ద్వారా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సోషల్ మీడియా మండల అధ్యక్షుడు గోపి పేర్కొన్నారు.

## పాత్రికేయ మిత్రులకు ఉచిత మెగా వైద్య శిబిరం



**జగ్గయ్యపేట, మార్చి 18, మేజర్ న్యూస్ :** పట్టణంలోని కొత్త వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మండపంలో నియోజకవర్గ వ్యాప్త మీడియా మిత్రులు వారి కుటుంబ సభ్యుల కొరకు జయప్రద ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం శ్రీరఘురామ్, జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్,జీరో పావర్టీ పి4 వైస్ చైర్ పర్సన్ చేకూరి కుటుంబరావు పాల్గొన్నారు. మెడికల్ క్యాంప్ ద్వారా పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహార భోజనం అందించాలి



**జగ్గయ్యపేట రూరల్, మార్చి 18, మేజర్ న్యూస్ :** మండలంలో షేర్ మహ మ్మద్‌పేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటశాల, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి స్వయంగా భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచి, పరిశుభ్రత, పోషక విలువలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాత య్య) మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి ప్రభుత్వ పాఠ శాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అం దేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం స్కీం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు చదువుపై ఆసక్తి పెంచేలా చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే వారు చదువులో మెరుగైన ఫలితాలు సాధించగలరని అన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీ సమయంలో పరిశుభ్రతకు అత్యంత ప్రా ధాన్యం ఇవ్వాలని, మెనూ ప్రకారం పోషకాహారం వండి వి ద్యార్థులకు సమయానికి అందించాలని వంట సిబ్బంది, సంబంధిత అధికా రులకు సూచించారు. పిల్లల ఆరోగ్యం, చదువు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాల గురించి ఉపాధ్యాయులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సక్రమంగా చదువుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రోత్సహిం చారు. విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, వారికి ఉత్తమ విద్యా వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కాసేపు సరదాగా గడిపి వారి చదువులు, భవిష్యత్తు లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ మండలి సమావేశం

**జగ్గయ్యపేట రూరల్, మార్చి 18, మేజర్ న్యూస్ :** మండలంలో గరికపా డులో స్థానిక డాక్టర్ కె.ఎల్. రావు కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం 26వ శాస్త్రీయ మండలి సమావేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను సాగించాలని, జిల్లాలోని మట్టి సారం, నీటి లభ్యతను బట్టి నూతన వంగడాలను రైతులకు పరిచయం చేయాలని సూచించారు. ప్రతి పరిశోధన రైతుకు ఆర్థికంగా లాభసాటిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జిల్లా పశువైద్యాధికారి డాక్ట ర్ హనుమంతరావు మాట్లాడుతూ పశుపోషణలో వస్తున్న నూతన సాంకేతి కతలపై అవగాహన కల్పిస్తూ, దేశీ గోవుల పాల ప్రయోజనాలను, కేవలం ఆడ దూడలే పుట్టేలా చేసే సాంకేతికతను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. తదనంతరం ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారిణి డి.విజయకుమా రి మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం దెబ్బతింటోం దని, రైతులు తక్కువ ఖర్చుతో కూడిన ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రాంతీయ పరిశోధనా స్థాన సహ సంచాలకులు డాక్టర్ ఎన్.వి.ఎస్. దుర్గాప్రసాద్, కృషి విజ్ఞాన కేంద్రం సీని యర్ శాస్త్రవేత్తలు గత ఏడాది ఫలితాలను, రాబోయే ఏడాది కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రగతిశీల రైతులు పి. చంద్రశే ఖర రావు, ఎం. రామకోటేశ్వర రావు, ఎన్. రవీంద్ర బాబు పాల్గొని, వ్యవసా య రంగంలో తాము ఎదుర్కొంటున్న సవాళ్లు, క్షేత్రస్థాయి అనుభవాలను పంచుకుంటూ తమ అమూల్యమైన సూచనలను అందించారు.ఈ కార్యక్ర మంలో శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనేదే లక్ష్యం



**జగ్గయ్యపేట, మార్చి 18, మేజర్ న్యూస్ :** ఎన్ఈసీసీ ఎగ్ కార్ట్ పథకం కింద లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కార్డులు పంపిణీ చేశారు. పేద, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే ఉద్దేశం తో అమలు చేస్తున్న ఎన్ఈసీసీ ఎగ్ కార్ట్ పథకం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) హాజరై లబ్ధిదారులకు ఎగ్ కార్డులను అందజేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ స్వయం ఉపాధి ద్వారా ఆర్థి కంగా ఎదగాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకో వాలని లబ్ధిదారులకు సూచించారు.ఈ పథకం ద్వారా ప్రతి లబ్ధిదారుకు రూ.50,000 విలువైన సహాయం అందించబడుతుందని, ఇందులో రూ. 35,000 సబ్సిడీగా, రూ.15,000 లబ్ధిదారుల వంతుగా ఉంటుందని తెలిపారు. అలాగే ఈ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ తులసి కృష్ణారావు, కౌన్సిలర్లు అధికారులు, ఎస్ హెచ్ జి సభ్యులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశాజ్యోతిలో ఉచిత వైద్య శిబిరం



**హనుమాన్ జంక్షన్, మార్చి 18, మేజర్ న్యూస్ :** హనుమాన్ జంక్షన్‌లోని ఆశాజ్యోతి హ్యాండీకాఫ్ట్ వెల్ఫేర్ సొసైటీలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రారంభించారు. ఏలూరుకు చెందిన ఆశ్రమ్ హాస్పిటల్, పెదవుటపల్లి సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, ఆశాజ్యోతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, ఆశాజ్యోతి వంటి సంస్థలో దివ్యాంగులకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. దివ్యాంగ పిల్లలను చేరదీసి వారి సంరక్షణకు కృషి చేస్తున్న నిర్వాహకులు మరేదు వెంకటస్వామి, మాధవీలత సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

## మోటార్ సైకిళ్ల దొంగకు 4 నెలల జైలు శిక్ష



**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిల్ దొంగతనం కేసుకు సంబంధించి ముద్దాయికి గుడివాడ ఎజెఎఫ్ సిఎం న్యాయాధికారి నాలుగు నెలల జైలు శిక్ష విధించినట్లు పామర్రు ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు గుడివాడ ఇన్‌చార్జి డీఎస్పీ చలసాని శ్రీనివాస్, పామర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి. శుభాకర్ పర్యవేక్షణలో పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన 11 మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులను విజయ వంతంగా ఛేదించారు. ఈ కేసులలో ప్రధాన ముద్దాయి కోటే భాస్కరరెడ్డిని పామర్రు పోలీస్ స్టేషన్ ఎస్ఐ వేపాటి రాజేంద్ర ప్రసాద్ అరెస్ట్ చేసి, కేసుకు సంబంధించిన చార్జ్ షీట్‌ను గుడివాడ ఎ.జె.ఎఫ్.సి.ఎం కోర్టులో దాఖలు చేశారు. కోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో ప్రాసిక్యూషన్ తరఫున ఎపిపి గీత సమర్థంగా వాదనలు వినిపించారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి అరుంధతి ముద్దాయికి నాలుగు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్సై తెలిపారు. అలాగే ఈ కేసు విచారణలో కోర్టు కానిస్టేబుల్ జి.వి.కృష్ణ సమన్వయం చేస్తూ చేసిన కృషి ప్రశంసనీయ మని పేర్కొన్నారు. కాగా ఈ కేసు విజయవంతంగా విచారణ పూర్తయ్యేందుకు కృషి చేసిన పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



**జగ్గయ్యపేట, మార్చి 18, మేజర్ న్యూస్ :** పట్టణంలోని శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ స్వగృహంలో వివిధ వార్డులకు చెందిన 10 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 5,95,988లు విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) బుధవారం స్వయం గా అందజేశారు. పట్టణంలోని పలు వార్డులకు చెందిన ఈ లబ్ధిదారులు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. అనంతరం వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్లులను స్థానిక వార్డు నాయకుల ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, బాధితుల తరఫున ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తులు పంపించి, నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో మంజూరైన నిధులను చెక్కుల రూపంలో బాధితులకు అందజేస్తూ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ,కౌన్సిలర్స్ ఇర్రి నరసింహారావు, పేరం సైదేశ్వరావు, షేక్ ఇజాజ్, కోటగిరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారానికి రామ్మూర్తి ఎంపిక



**మొవ్వ మేజర్ న్యూస్ :** భారతీయ శాస్త్రీయ నృత్య రంగంలో ఐదు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలను అందించిన ప్రముఖ కూచిపూడి కళాకారుడు, నృత్య దర్శకుడు, నాట్యాచార్యులు కూచిపూడి గ్రా మంలోని సంప్రదాయ వంశంలో జన్మించిన హరి రామమూర్తి ప్రతి ఏటా ఉగాది వేడుకల సందర్భం గా వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు ఉగాది పురస్కార అవార్డులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. అందులో భాగంగానే కూచిపూడి నృత్యంలో విశిష్ట సేవలు అందించిన హరి. రామమూర్తి కళా రత్న అవార్డుకు ఎంపికయ్యారు. కూచిపూడి నృత్య సంప్రదా యాన్ని పరిరక్షించడం, ప్రచారం చేయడం, అభివృద్ధి చేయడం లక్ష్యంగా జీవి తాన్ని అంకితం చేశారు. ప్రదర్శనలు, బోధ న, శాస్త్రీయ పరిశోధనల ద్వారా కూచిపూడి కళను ప్రపంచానికి పరిచయం చేశారు. అమెరికా, సోవియట్ యూనియన్ (యు ఎస్ ఎస్ ఆర్)జర్మనీ తదితర దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి అంతర్జాతీయ గుర్తింపు పొందారు. దూరదర్శన్ ఎ&బి గ్రేడ్ కళాకారులుగా, డిప్లొమా కోర్సులు, స్కాలర్‌షిప్‌లకు విద్యార్థులను తీర్చిదిద్దడంలో విశేష నైపుణ్యం కలిగిన వంశపారం పర్యావర సత్య కూచిపూడి నృత్యానికి అనేక తరాలుగా సేవలందిస్తున్న నేపథ్యంలోగల కుటుంబం కూచిపూడి సంప్రదాయ అభివృద్ధికి కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ నా జీవిత లక్ష్యం కూచిపూడి నృత్య సంప్రదాయాన్ని పరిరక్షించడం, అభివృద్ధి చేయడం. కూచిపూడి గ్రామంలో జన్మించి, మహనీయుల వద్ద శిక్షణ పొందిన నేను, ఐదు దశాబ్దాలుగా ఈ కళకు సేవ చేస్తున్నాను.నా ప్రదర్శనలు ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతిని ప్రాచుర్యం చేశాయి. అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దడం నా గొప్ప సాధనగా భావిస్తున్నాను.

## భవిత కేంద్రాన్ని సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి రామకృష్ణయ్య



**పామర్రు మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన పామర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గల భవిత కేంద్రాన్ని బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి కె.వి.రామకృష్ణయ్య సందర్శించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలోని దివ్యాంగులను, వారి తల్లిదండ్రులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి చైల్డ్ హెల్ప్ లైన్ 1098, టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 15100, మహిళల హెల్ప్ లైన్ నెంబర్ 181 మహిళలకు అందజేసి వారి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శించి అక్కడ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఉచిత చట్టాలపై, మహిళల బాలల హక్కులపై అవగాహన కల్పించారు. అలాగే ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థినీవిద్యార్థుల సమస్యలపై, చట్టాలపై ఉచిత న్యాయ సహాయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి - 2 జి.పద్మావాణి, ఐఈఆర్ టి ఉపాధ్యాయులు కె.మరియన్న, ఎం.కోటేశ్వరరావు, ఫిజియోథెరపిస్ట్ కె. శ్యాంప్రసాద్, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేటను జిల్లాలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దటమే నా లక్ష్యం



జగ్గయ్యపేట, మార్చి 18, మేజర్ న్యూస్ : పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, జగ్గయ్యపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దటమే నా ప్రధాన లక్ష్యం అని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రంగస్వామి బజార్‌లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ జిల్లా ఖనిజ నిధి (డిఎంఎఫ్) గ్రాంట్ నుండి సుమారు 7 కోట్ల 23 లక్షల రూపాయల భారీ వ్యయంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న రంగస్వామి బజార్ ప్రధాన రహదారిని అత్యున్నత ప్రమాణాలతో నిర్మిస్తున్నామని, దీనివల్ల స్థానికులకు, వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద అవసరమైన సివిల్ పనులను, మౌలిక సదుపాయాలను వెంటనే పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కేవలం ప్రధాన రహదారులే కాకుండా, ప్రతి వార్డులోనూ అంతర్గత సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ (కాలువలు) సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. నీటి నిల్వ లేకుండా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

అనంతరం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పట్టణంలో పేరుకుపోయిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనుల్లో వేగం పెరిగిందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. వార్డుల్లో ఎక్కడైతే రోడ్లు, డ్రైనేజీలు సరిగా లేవో వాటిని గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రి సహకారంతో జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెడతాం. ప్రతి పైసా ప్రజల సంక్షేమం కోసం, పట్టణ సుందరీకరణ కోసం ఖర్చు చేస్తున్నామని ఆయన అన్నారు. మున్సిపల్ కమిషనర్ తులసి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి పార్టీ ముఖ్య నాయకులు, వార్డు ఇన్చార్జులు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సేవా భావంతో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు



హనుమాన్ జంక్షన్, మార్చి 18, మేజర్ న్యూస్ : పి4 పథకం భాగంగా హనుమాన్ జంక్షన్ ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ప్రవంతి చారిటబుల్ ట్రస్ట్, అన్వి సూపర్ స్పెషాలిటీ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ప్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, శ్రీదేవి దంపతులను అభినందించారు. హనుమాన్ జంక్షన్ వంటి రద్దీ ప్రాంతంలో ఉన్న బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు శుద్ధమైన తాగునీరు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా రోజూ బస్సు ప్రయాణికులు, స్థానిక ప్రజలు సురక్షితమైన తాగునీటిని సులభంగా పొందగలరని తెలిపారు. సేవాభావంతో ప్రజల కోసం ఇలాంటి సదుపాయాలు ఏర్పాటు చేయడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రజలకు అవసరమైన ప్రాథమిక వసతులు అందించడంలో ప్రభుత్వం, సేవా సంస్థలు కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, గన్నవరం మార్కెట్ కమిటీ చైర్మన్ గూడవల్లి నరసయ్య, ఆర్టీసీ ఈడీ జివరత్నం, డీఎం పిట్టా శివాజీ, స్పెషల్ ఆఫీసర్ షాహిద్ బాబు, ఎంపీడీఓ జోగేశ్వరరావు, ఎంఈఓ రామ్ బాలా సింగ్, ఈఓ శేషపూర్ణేశ్వరి, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు దయాల రాజేశ్వర రావు, టౌన్ పార్టీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రేమల్లె జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే



హనుమాన్ జంక్షన్, మార్చి 18, మేజర్ న్యూస్ : బాపులపాడు మండలం రేమల్లె గ్రామంలో గన్నవరం ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ తీరును, విద్యార్థులకు అందుతున్న వసతులను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాల మెనూను పరిశీలించడమే కాకుండా, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను స్వయంగా పరీక్షించారు. వంటశాలను సందర్శించి అక్కడ ఉన్న పరిస్థితులను, పరిశుభ్రతను తనిఖీ చేసిన ఆయన, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాముఖ్యతనిస్తూ వంటగదిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సాధారణంగా మిడ్ డే మిల్స్ ఉదయం 10:30 గంటల ప్రాంతంలో సిద్ధం కావాల్సి ఉండగా, 12 గంటల తర్వాత ఎందుకు పెడుతున్నారని ఆయన ఆరా తీశారు. దీనిపై విద్యార్థులు స్పందిస్తూ, తామే మధ్యాహ్నం 12 గంటలకే భోజనం చేస్తామని చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించిన ఎమ్మెల్యే, వారు చదువులో రాణించాలని, ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కష్టపడాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ అదే గ్రామంలో 'రైతన్న మీ కోసం' వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక రైతులతో నేరుగా సమావేశమై వారి సాగు కష్టాలను, క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అన్నదాతల కోసం అహర్నిశలు కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతు ఖాతాలో నేరుగా నగదు జమ చేసే ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసిందని, రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, గన్నవరం ఎఎంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, మండల టిడిపి అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, గ్రామ టిడిపి అధ్యక్షులు కొల్లూరు చంద్రకాంత్, క్లస్టర్ ఇన్చార్జి కలపాల కుమార్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, మొవ్వ వెంకటేశ్వరరావు, వేగిరెడ్డి పాపారావు, యూనిట్ ఇన్చార్జి గుడివాడ విజయానంద్, చింతల వెంకట అప్పారావు, ఈడే నారాయణ, కొనగళ్ళ దుర్గారావు, బాణావతుల ఆదియ, తిరివీధుల మరియదాసు, కలపాల రాధాకృష్ణ, కొమ్మారెడ్డి రాజేష్, చిన్నాల లక్ష్మీనారాయణ, యనమదల సుధాకర్, తొమ్ముండ్రు వంశీ, చల్లగుల్ల లోకేశ్వరరావు, కర్ర ప్రసాద్ పాల్, మండాది రవీంద్ర, రాజులపాటి నాగరాజు, సొంగా భాస్కర్, చోడిమెళ్ళ శేషు, రాజబాబు, చేబత్తిన వంశీ, బేతాళ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన ఎమ్మెల్యే తనయుడు




అవనిగడ్డ మేజర్ న్యూస్ : అత్యవసర స్థితిలో రక్తం అవసరమైన వ్యక్తి కోసం ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ విజయవాడ వెళ్లి రక్తదానం చేశారు. వివరాల్లోకి వెళితే కొత్తపేట గ్రామానికి చెందిన చందన శ్రీనివాసరావు అనే వ్యక్తికి గుండె ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా ఏబి పాజిటివ్ రక్తం అవసరమని మన అవనిగడ్డ బ్లడ్ డోనార్స్ గ్రూప్ ద్వారా తెలుసుకున్న వెంటనే, తన బిజీ షెడ్యూల్‌ను పక్కన పెట్టి హుటాహుటిన విజయవాడకు బయలుదేరి వెళ్లి వెంటనే రక్తాన్ని అందజేశారు. కార్యకర్తల కోసం ఆయన చేసిన రక్తదానం మరెందరికో స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు.

## భక్త సమాజాలు మోసపపోకండి



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా భక్త సమాజాల రిజిస్ట్రేషన్ చేస్తామంటూ చెప్పే వారి మాటలు నమ్మి మోస పోవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం అవనిగడ్డ మండల ధర్మాచార్యులు అన్నపరెడ్డి కృష్ణ హెచ్చరించారు. బుధవారం పులిగడ్డ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 6 మండలాలలోని గ్రామీణ ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు అయ్యే భక్త సమాజాలను తిరుమల తిరుపతి దేవస్థానం రిజిస్ట్రేషన్ చేస్తామంటూ కొన్ని ప్రైవేటు సంస్థలు గ్రామాలలో తిరిగి మోసపూరిత మాటలు చెప్పి నగదు వసూలు చేస్తున్నారని వారి మాటలను నమ్మవద్దని ఆయన కోరారు. 2017, 18 లో రిజిస్టర్ అయిన భక్త సమాజాలు తప్ప ఆ తర్వాత ఎలాంటి రిజిస్ట్రేషన్ అవ్వలేదని తెలిపారు. టీటీడీ భక్త సమాజాల రిజిస్ట్రేషన్ కొరకు మరి ఇతర కార్యక్రమాలకైనా సరే భక్తుల నుండి ఎటువంటి రుసుము వసూలు చేయదని, కొంతమంది ధనార్జనే ధ్యేయంగా చేసుకుని తిరుమల తిరుపతి దేవస్థానంలో మీ సమాజాన్ని రిజిస్టర్ చేయించి ఇన్సూరెన్స్ చేస్తామని ఐడెంటి కార్డులు ఇస్తాం అంటూ ఒక్కొక్క నెంబర్ నుండి 3000 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుందని అటువంటి వారిని నమ్మి ఎవరు డబ్బు చెల్లించి మోసపోవద్దని హెచ్చరించారు. కొత్త సమాజాలు ఏర్పాటు చేసుకునేవారు భజన సమాజం ప్రెసిడెంట్ నేరుగా అప్లికేషన్లు తీసుకొని సమాజం సభ్యులు ఆధార్ నెంబర్లు జిరాక్స్ కాపీలు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేసి తిరుపతిలో ఉన్న వెంకటేశ్వర యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదురుగా గల శ్వేతా భవనంలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రధాన కార్యాలయంలో భార్గవ్ అనే వ్యక్తి అందజేయాలని ధర్మాచార్యులు కృష్ణ సూచించారు.

## ముచ్చనపల్లిలో డ్వాక్రా సభ్యుల డబ్బులు గోల్ మాల్

**లబోదిబోమంటున్న డ్వాక్రా బాధితులు**

**అధికారుల సహకారంతో బుక్ కీపర్ చేతివాటం**

**స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితుల ఫిర్యాదు**

**ముచ్చ నపల్లి గ్రామానికి చెందిన బుక్ కీపర్ బత్తుల మౌనిక**




రెడ్డి గూడెం, మేజర్ న్యూస్ : విస్సన్నపేట ఇండియన్ బ్యాంకులో 30 లక్షల రూపాయల డ్వాక్రా సొమ్మును స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏపీఎం, రామకృష్ణ, సీసీ, బుక్ కీపర్ మౌనిక, విస్సన్నపేట ఇండియన్ బ్యాంకు శాఖ అధికారులు, కుమ్మక్కై 30 లక్షలు, గోల్మాల్ చేశారంటూ పలువురు మహిళలు రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ముచ్చనపల్లి గ్రామంలో మహిళా మండలి సుమారు 38 గ్రూపుల్లో డబ్బులు సుమారు 30 లక్షల రూపాయలు వరకు విస్సన్నపేట ఇండియన్ బ్యాంకు శాఖ నుంచి మహిళా మండలి సభ్యులకు తెలియకుండా డబ్బులను స్వాహా చేశారు. తమకు న్యాయం చేయాలని, కట్టిన డబ్బులు తమకు సంబంధించిన 30 డ్వాక్రా గ్రూపులలో అమౌంట్ ఉండాలని, అకౌంట్లో డబ్బులు లేవని డ్వాక్రా గ్రూపు సభ్యులు విస్సన్నపేట ఇండియన్ బ్యాంకు శాఖ ముందు ఆందోళన చేశారు. డబ్బులు తీసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలు డ్వాక్రా గ్రూపు సభ్యులు రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారుల పనితీరు ప్రశంసనీయం

## ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ అభినందనలు



**విజయవాడ, మార్చి 18, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో జర్నలిస్టులందరికీ మీడియా అక్రిడిటేషన్స్ అందించడంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారుల పనితీరు ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని గవర్నర్‌పేట ప్రాంతంలో ఉన్న జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సీనియర్ జర్నలిస్ట్, ఎన్టీఆర్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు యేమినేని వెంకటరమణ ఆధ్వర్యంలో విజయవాడ నగర అధ్యక్షుడు తాళ్లూరు అనిల్ కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం ఈ సందర్భంగా ఏపీఎంపీఏ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, విజయవాడ నగర ఉపాధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, కోట రాజా తదితరులు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులను కలిసి దుశాలువాతో సన్మానించారు. జర్నలిస్టుల పట్ల అధికారులు చూపిన సానుకూల దృక్పథం, పారదర్శక విధానాన్ని ప్రశంసిస్తూ సంఘం నాయకులు తమ కృతజ్ఞతలు తెలిపారు. వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందజేయడం అనేది కేవలం పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాకుండా, మీడియా రంగానికి ప్రభుత్వ గుర్తింపు, ప్రోత్సాహం అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఈ ప్రక్రియను వేగవంతంగా, నిష్పక్షపాతంగా అమలు చేయడంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీషా పర్యవేక్షణలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులు కీలక పాత్ర పోషించారని ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా డిపిఆర్ఓ రమణ, డివిజనల్ పి.ఆర్.ఓ.రవి, ప్రసాద్ తదితర అధికారులు జర్నలిస్టులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ప్రతి అంశాన్ని సమగ్రంగా పరిశీలించి అర్హులైన



ప్రతి ఒక్కరి వర్కింగ్ జర్నలిస్ట్ కు అక్రిడిటేషన్ అందేలా చర్యలు తీసుకోవడం అభినందనీయం కమిటీ సభ్య యేమినేని వెంకట రమణ పేర్కొన్నారు. అలాగే జర్నలిస్టులు సమాజానికి అద్దం పట్టే వర్గమని, వారి పనితీరుకు సరైన గుర్తింపు లభించడం అవసరమని ఆయన అన్నారు. అక్రిడిటేషన్ కార్డుల ద్వారా జర్నలిస్టులకు అధికారిక గుర్తింపు లభించడంతో పాటు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కలుగుతుందని, సమాచార సేకరణలో సౌలభ్యం పెరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులు మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా మార్గదర్శకత్వంలో ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు జర్నలిస్టు సంఘాల సభ్యులతో పలుమార్లు చర్చలు జరిపి, అర్హత ప్రమాణాలను స్పష్టంగా నిర్ధారించి, ప్రతి అర్హుడైన జర్నలిస్టుకి అక్రిడిటేషన్ అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో పారదర్శకతను పాటించడం, ఎటువంటి వివక్ష లేకుండా వ్యవహరించడం తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అదేవిధంగా భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో, వారి వృత్తి అభివృద్ధికి సహకరించడంలో జిల్లా పౌర సంబంధాల శాఖ ఎల్లప్పుడూ ముందుండుతుందని అధికారులు హామీ ఇచ్చారు. జర్నలిస్టులు, ప్రభుత్వ యంత్రాంగం మధ్య పరస్పర అవగాహన, సహకారం పెరిగితే సమాజానికి మరింత నాణ్యమైన సమాచారాన్ని అందించగలమని వారు అభిప్రాయపడ్డారు. మొత్తంగా, ఎన్టీఆర్ జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ప్రభుత్వం, అధికారులు, మీడియా వర్గాల మధ్య మంచి అనుబంధం నెలకొన్నదని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది. ఇది భవిష్యత్తులో కూడా మీడియా–ప్రభుత్వ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగుగా భావించవచ్చు..

# ఎంపీ నిధులతో సగర కళ్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

## శంకుస్థాపన చేసిన ఎంపీ శివనాద్, ఎమ్మెల్యే బోండా



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని సగర సామాజిక వర్గ ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. 31వ డివిజన్ పసుపు తోట వాటర్ ట్యాంక్ ఎదురు ప్రాంతంలో రూ.75 లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి సగర కళ్యాణ మండపం నిర్మాణ పనులకు బుధవారం సాయంత్రం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఘనంగా శంకుస్థాపన చేశారు. 2024 ఎన్నికల పాదయాత్ర సమయంలో సగర కులస్థులు తమ సామాజిక అవసరాల కోసం ఒక కళ్యాణ మండపం కావాలని కోరగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మిస్తానని ఎంపీ శివనాథ్ తో కలిసి ఎమ్మెల్యే బొండా ఉమా హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, నిధులు మంజూరు చేయించి నేడు ఎంపీ కేశినేని చిన్నితో కలిసి ఆయన భూమి పూజ నిర్వహించారు. శాస్త్రోక్తంగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే లు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించే గుణం ఎమ్మెల్యే బొండా ఉమాలో ఉందని కొనియాడారు. ప్రజల కోరికలను నెరవేర్చడమే తమ ప్రాధాన్యతని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ



బలహీన వర్గాలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించడం సంతోషంగా ఉందని, ఈ భవనం భవిష్యత్తులో శుభకార్యాలకు, సామాజిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ కాకొల్లు మహేంద్ర నాథ్, ప్రధాన కార్యదర్శి దాట్ల రాజేష్, దేవరపు మాల్యాద్రి, గోవింద్, బుజ్జి, ఇతర నాయకులు, సగర సమాజం ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ముస్లిం మైనారిటీల ధ్యేయం

### విజయవాడ పశ్చిమలో షాదీ ఖానాల అభివృద్ధికి కృషి చేస్తా

### ఇఫ్తార్ విందులో ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని)

### ఇఫ్తార్ విందుకు హాజరైన వేలాదిమంది ముస్లిం సోదరులు



**విజయవాడ పశ్చిమ మేజర్ న్యూస్ :** ముస్లిం మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముస్లిం, మైనారిటీల పక్షపాతి అని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని ) అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజక వర్గం చిట్టినగర్ ఈద్గా ప్రాంగణం లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఇఫ్తార్ విందుకు ఎంపీ శివనాద్ తో పాటుగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కె నాగులమీరా, మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు..... హాజరై ముస్లిం సోదరులతో కలిసి విందు స్వీకరించారు. ముస్లిం సోదరులకు భోజనాన్ని స్వయంగా ఎంపీ శివనాథ్ వడ్డించారు... టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి ఫతావుల్ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ....విజయవాడ నగర అభివృద్ధిలో ముస్లిం సోదరుల పాత్ర గొప్పదన్నారు. గడచిన ఎంపీ ఎన్నికల్లో తనకు అత్యధిక మెజార్టీ వచ్చిందంటే ముస్లిం సోదరుల అభిమానమే కారణమని ఎంపీ శివనాథ్ అన్నారు. సుదీర్ఘకాలం నుంచి తమ కుటుంబం ముస్లిం కుటుంబాలతో కలిసి మెలసి ఉండే కుటుంబమన్నారు. విజయవాడ లో అన్ని కులాల వారు కలిసి మెలసి ఉండే సంస్కృతి ఉందని, ఇటువంటి సమైక్యంగా ఉన్న నగరం దేశంలో విజయవాడ మాత్రమే అన్నారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలలోను ఇఫ్తార్ విందు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తిరువూరు లో ఇఫ్తార్ విందు ముస్లింలకు ఇవ్వడం జరిగిందన్నారు. పార్లమెంట్ సమావేశాలు ఉన్నప్పటికీ రంజాన్ పర్వదినాలలో ఇఫ్తార్ విందులకు హాజరై ముస్లిం సోదరులతో గడపడం సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాసంలో...ప్రపంచ శాంతి కోసం అందరం కలిసి ప్రార్థిద్ధం అంటూ ఎంపీ పిలుపునిచ్చారు.జగ్గయ్యపేట, తిరువూరు పశ్చిమ నియోజక వర్గంలో కుమ్మరిపాలెంలో షాది ఖానా,ఈద్గా గ్రౌండ్, చిట్టినగర్లో మోథీ మసీదు షాధిఖానా, అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయింపులు త్వరలోనే జరిగేలా చూస్తానని, వచ్చేయడాది రంజాన్ నాటికి ఆయా షాదీ ఖానాలు అభివృద్ధి చెందెలా చూస్తా అన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

జగ్గయ్య పేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య మాట్లాడుతూ..టిడిపి కూటమి ప్రభుత్వం మైనార్టీ పక్షపాత ప్రభుత్వం అన్నారు. ముస్లింల సంక్షేమం టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ వెంకన్న తదితరులు మాట్లాడుతూ... విజయవాడ పార్లమెంట్ పరిధిలో ముస్లిం మైనారిటీలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించే నాయకుడు ఎంపీ కేశినేని శివనాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, మైనారిటీ యువ నాయకులు సాహుల్ ఖాన్, పశ్చిమ నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడు టి.ఆన్సార్, ప్రధాన కార్యదర్శి సుభాని, ముస్లిం మైనారిటీ నాయకులు జాహిద్, అజ్జీజ్, అమానుల్లా, ఫైజాన్, అలీ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999